# మానవత్వం మరుగైనచోట




మంచికంటి సుబ్బలక్ష్మి

అష్టకష్టాలంటారు గానీ నన్నడిగితే అష్టకష్టాల్ని మించినది మరోటి ఉంది. గుమస్తాని, నెలమూడోవారంలో అర్థాంతరంగా బదిలీచేస్తే అంతకుమించిన కష్టం ఏవుంటుంది? ఆగతే నాక్కూడాపట్టింది. ఉన్నట్టుండి పొన్నూరి నుంచి విజయవాడకు బదిలీఅవడంతో ఈపెద్దకష్టం అనుభవంలో కొచ్చింది నాకు. తట్టా, బుట్టా, మూటాముల్లే సర్దుకుని "రాయేఎంకీబస్తీకంటూ మాఆవిడతో (అమ్మో... హైడ్రోజన్‌బాంబే) విజయవాడ వెళ్ళాల్సొచ్చింది (ట్రాన్స్‌ఫర్ బెనిఫిట్స్ వల్లవచ్చిన ఒక నెలజీతం అడ్వాన్సూ చిల్లర మల్లర అప్పులు తీర్చుకున్నాలెండి. లేకపోతే మధ్యతరగతి గుమస్తా పరువుగతి గాడిపొయ్యిమీద నీటిజల్లే అవుతుంది.

మనం చంద్రలోకం చేరుకుంటామో తేమో చెప్పలేముగాని విజయవాడ ఇళ్ళ అద్దెలుమాత్రం ఎప్పుడో చేరుకున్నాయి. చాలీచాలని దుప్పటిలాంటి జీతంలో నాలుగోవంతు ఇంటిఅద్దె మాత్రం తప్పదు. విజయవాడలో ఒక సొంతఇల్లు ఉందా, ఆరుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళయినా అవలీలగా చేసెయ్యొచ్చు.

* * *

"అమ్మో! ఈ బొమ్మరింటికి అరవై రూపాయలు అద్దా? అసలుఇందులో ఇదివరకు ఎవరయినా కాపురమున్నారా? ఇంతకన్నా చౌకలోఎక్కడా దొరకలేదా మీకు? అయినా మీకు శ్రద్ధేగనక ఉంటే మన సంసారం ఇలాఎందుకు ఉంటుందిలెండి" అంటూఇల్లు చూడగానే సహస్రనామార్చన ప్రారంభించింది మా ఆవిడ. ఈ ఇంటికే రెండునెలల అద్దె అడ్వాన్సుగా ఇచ్చానని చెపితే గుండె పగిలిపోతుందేమోనని మాట్లాడకుండా ఊరుకున్నాను.

* * *

అవాళ ఆఫీసునుంచి తిరిగొచ్చేసరికి ఆరయింది. మా వాటాకు గొళ్ళెం పెట్టి ఉంది. పక్కవాటాలోంచి మా శాంత గొంతుగట్టిగా వినిపిస్తోంది. తలుపు తీసి లోపలికి అడుగుపెట్టాను. మా బుజ్జిగాడు బుద్ధిగాచాపమీద నిద్రపోతున్నాడు. మా ఆవిడఇట్టే ఎవరితోనయినా కలిసిపోగలదులెండి! అసలు ఇద్దరు మొగాళ్ళకన్నా ఇద్దరుఆడవాళ్ళు తొందరగా స్నేహితులయిపోతారు. విడిపోవడం కూడా అంత తేలికగానే జరిగిపోతుంది వాళ్ళమధ్య-

"కీ"అయ్యేదాకా మ్రోగేఅలారం గడియారంలా మా ఆవిడ మాట్లాడుతూ ఉంది. గడియారంఆపితే ఆగుతుందేమో కాని మా ఆవిడమాటల్ని ఆపటంబ్రహ్మతరం కూడాకాదు. తాళికట్టిన భర్తను గనుక దానివాగుడు భరిస్తున్నాను. తప్పుతుందా ఏరికోరి, వలచి, వలపించుకుని చేసుకున్నాను కనకమరీ అలుసెక్కువ. "సరేలే! నువ్వేవస్తావు" అనుకునిఅప్పుడే కొనితెచ్చుకున్న నారాయణ్ నవల "బేచిలర్ ఆఫ్ఆర్ట్స్" తీసి చదవడం మొదలుపెట్టాను.

పట్టుమని పదిపేజీలు చదివానో లేదో గాలిదుమారంలా వచ్చింది. "ఇదిగో! చూశారా? ఈ పక్కవాటలోఉన్న సుశీల ఎవరనుకున్నారు? మా మేనమామ కోడ

లికి చెల్లెలి ఆడపడుచేనండీ! వాళ్ళాయనకి నెలలో ఇరవైరోజులు ఊళ్ళమీద తిరిగేఉద్యోగ౦వట. అదేంమనిషో చాలా ముక్తసరిగాఉంది" అంటూనాదగ్గర్నుంచి సమాధానం రాకపోవడంతో గట్టిగా కుదిపింది నన్ను.

"అబ్బ! నీమాటలువినిపిస్తున్నాయిలే శాంతా" అన్నానుకొంచెం విసుగ్గా. మా ఆవిడ మాటలు డైనమేట్ శబ్దంకన్నా ఇంకా పెద్దవి.

"ఆపుస్తకాలమీద మీకు ఎక్కడలేని ఆపేక్ష.అయినా మీకుచెప్పేకన్నా అగోడకు చెప్పుకుంటే కాస్తనయం. కటుకున్న భార్య కన్నా జీవంలేని ఆ కాగితాలంటే మోజు" అనిలోపలికి వెళ్ళిపోయింది.

"ఆ గోడకు చెప్పేపనే చెయ్యలేకపోయావ్? వినీవినీ విసుగుపుట్టి నిలువునా కూలుతుంది"అనిమనసులోఅనుకున్నాను. పైకిఅంటే కోల్డువార్ కాస్తా ప్రచ్ఛన్న యుద్ధంగా మారుతుందేమోనని భయం.

అయినా సుశీలమొగుడు మనకెవరైతే ఏంచెప్పండి? ఆయనజీతం ఎంత? కత్తిరింపులుపోను ఎంతవచ్చేది అన్నీచిటికెలో ఆరాతీసుంది మా ఆవిడ. అసలు మా శాంత సమాచారశాఖా మంత్రిణిగా బాగా రాణించగలదు అంటాను నేను అందుకే.

* * *

ముక్తసరి అనుకున్నసుశీల మూడోనాటికి మాఆవిడ ప్రాణస్నేహితురాలయిపోయింది. మా శాంతలో ఉన్న చాకచక్యం ఏమోకాని ఎటువంటి వాళ్ళయినా సరే ఇద్దేతమ సొంతగొడవలు చెప్పుకునేంత ముఖ్యులయిపోతారు. పదిరోజుల్లో సుశీల పూర్వోత్తరాలన్నీ ఆరాతీయ గలిగింది మా ఆవిడ.

కొంతమంది తమబాధనుఎదుటివాళ్ళకు చెప్పుకుని సానుభూతి పొందుతుంటారు. దాంతో కొంతమనస్సు తేలిక పడుతుంది వాళ్ళకు. కొంతమంది మాత్రం మేరువగ ధీరులు. ఎంతటికష్టం కలిగినాఎదటివాళ్ళు గ్రహించాలేకాని పెదవివిప్పి చెప్పుకోరు. ఆ కోవకుచెందినదే సుశీలకూడా.

"సుశీల మొగుడులేడండీ (లేడని నేనన్నానా చెప్పండి) మహాకరుకు మనిషి. మధ్యాహ్నం డ్యూటీనుంచి వచ్చాడు ఆయనవస్తాడని ఆవిడకు తెలియదేమో, వంట చెయ్యలేదు. దాంతోఆయన తారాజువ్వలా యింటికెగిరిపోతూమాట్లాడాడు. "వండిపెట్టడానికి కూడాతీరదా? నీపుట్టింటినుండేం తీసుకురావడం లేదుగా? ఏమీ పెట్టలేనివాళ్ళనే చూసుకుని ఇంత మిడిసిపాటయితే, ఇంకాపెట్టి పొయ్యగలిగిన వాళ్ళయితే ఎలా తగలడేదో" అంటూ మొదలుపెట్టాడు సుమండీ.... అని తాను విన్నదాన్నియధాతథంగా నాచెవినవేర్చింది శాంత.

దానాదీనా తేలిందేవి౦టంటే సుశీల పుట్టింటివాళ్ళు ఏమంతగా కలిగినవాళ్ళు కాదు. ఉన్నకాస్తా తెగనమ్మి ఆడపిల్ల పెళ్ళిచేసి 'గుండెలమీద కుంపటిని' దించుకున్నాడు సుశీలఅన్నగారు. కానిఆకుంపటి మరో విధంగా తన చెల్లెలి గుండెల్లో మంట కురుస్తోందని అతనికి తెలియదులా ఉంది. గోరంతలు కొండంతలుచేసి సాధి

స్తూంటాడని తెలిసింది. నేను మా ఆవిడ వాచాలతనా భరిస్తున్నట్టే సుశీలకూడా ఆ భర్త అనబడే పోషణకర్తతో కాలంనెట్టుకువస్తోంది. నేనెప్పుడైనా (కనీసం సరదాకి) మా శాంత పుట్టింటివాళ్ళ సంగతి ఎత్తానా, మాఆవిడ మా అమ్మా నాన్నల ఏడుతరాలవాళ్ళనీ వీధిలోకి ఈడుస్తుంది. అందుకే నేనంటాను. 'పూజకొద్దీ పురుషుడేకాదు 'పూజకొద్దీ పడతీ' అని.

* * *

ఒకరోజు సాయంత్రం నా వాహనరాజమయిన 'రాలీ'ని ఎక్కడ పెట్టనా అని చూస్తున్నాను. గుమ్మంలో ఉంచితే పిల్లలు గాలి తీసేస్తున్నారు. అది గ్రహించింది కాబోలు సుశీల, "అన్నయ్యగారూ! మీ సైకిలుని మా వరండాలో పెట్టుకోండి. మాకేం ఇబ్బంది ఉండదులెండి" అన్నది. అదుగో అప్పుడే తలెత్తి చూశాను ఆవిడ్ని. చక్కగా మిసమిసలాడుతున్న పసిమిఛాయ. ఆకర్షణీయమైన కళ్ళు. మంచి కనుముక్కుతీరుగా ఉంది సుశీల.

ఎక్కణ్ణుంచీ విందో మా మాటలు రానే వచ్చింది రివ్వున మా భార్యామణి. "చూశావా సుశీలా! ఈయనకు పెళ్ళాం మీదకంటే ఆ ఇనుపముక్కలమీద మహా ప్రేమ. ఏమయినా అంటే "నీ కంటే ముందొచ్చిందే ఇది" అంటారు. ఇంటి మీద ఇల్లాలిమీద ఆపాటి శ్రద్ధే కనక వుంటే నేనిలా మొండిగా ఎందుకుంటాను చెప్పు," అంది. ఓ చిరునవ్వునవ్వి లోపలికి వెళ్ళిపోయింది సుశీల.

అసలు మా ఆవిడకు నేను నగానట్రా చేయించలేదని గుసుపు. కాని ఏమాటకామాటే చెప్పుకోవాలి. "పల్కు ధారుణా ఖండ శస్త్ర తుల్యం" అయినా మనసు మాత్రం "నవ్య నవనీత సమానం. మొన్నీమధ్య మా తమ్ముడికి జబ్బుచేస్తే తన గొలుసిచ్చి. అమ్మి మావాడికి డబ్బు పంపేదాకా ఊరుకుందా మరి? ఈ సారి ప్రావిడెంట్ ఫండ్ లోన్ తీసుకునయినా సరే శాంతకు గొలుసు చేయించాలని గట్టిగా అనుకున్నాను.

* * *



ఓ సారి కూరగాయల నరసయ్య ఏదో మాటల సందర్భంగా "బాబూ! నేను ఎప్పుడూ పక్కింటి సుశీలమ్మగారికి కూరలమ్మను. ఆ బాబుగారు మా సెడ్డగా మాటాడతారు. నాకు కులం తక్కువయినా గుణానికీ లోటులేదు, ఓపాలి నా కాడ కూరలు బేరం చేసారని, ఆ అమ్మాయిగార్ని, 'అడ్డమైన ఎదవల్తోటీ నీ కేటి?' అంటూ కూకలేశారు. మంచితనంలేని మనిసంటే నాకు మా సిరాకు బాబయ్యా" అన్నాడు. వాడి మాటలవల్లకాకపోయినా సుశీల మొగుడు అంత సంస్కార హృదయుడు కాదని అనుకోడానికి ఆ మర్నాడు జరిగినసంఘటనవల్ల తెలుసుకున్నాన్నేను

అవాళ సాయంత్రం ఆఫీసునుంచొచ్చిన నాకు తాళంకప్ప వెక్కిరిస్తూ పలకరించింది. 'శాంత బజారుకెళ్ళాం' దని చెప్పి తాళం ఇచ్చింది సుశీల. ఎన్నికలయిన మర్నాడులా ప్రశాంతంగా వుంది ఇల్లు. ఏం తోచక హార్డీ నవల 'ఫార్ ఫ్రంది మాడింగ్ క్రౌడ్' తీశాను! ఇంతలో ప్రక్కవాటానుండి సన్నగా మాటలు వినవచ్చాయి. 'సుశీల భర్త వచ్చాడు కాబోలు' అనుకున్నాను.

'నా మెడకో గుదిబండ కట్టారు. మీవాళ్ళు. ఛీ....పాడు సంసారం? వెధవ బ్రతుకు బ్రతక్కపోతేనేం? ఎందులో నన్నాపడి చావరాదూ! నీకు సోడా కావలసి వస్తే ఆ రాములు గాడే దొరికాడా? ఎర్రగా అందంగా వుంటాడని వాడి దగ్గరే కొంటావు.' అన్నాడు. ఏదో.... భార్యాభర్తలు ఘర్షణ పడుతున్నారులా వుంది అనుకున్నాను. మళ్ళీ పుస్తకంవేపు

## ఆకర్షణ

...

కాసి బంగరు ఛాయ
కనుల రగులొల్పెనే—
లేడి కన్నుల చూపు
లేప జూసెను, సోకు

ఆవన్నె సొగసులు
ఆరీతి కాంతులు
ఆ కోడె వలపులు
ఆపాడి కులుకులు

అలగోలె వలవేసి,
కనుపందు బిగజేసి,
ననుగోర మరిజేరి
పనులన్ని, కనగోరి,

పురికించె ప్రణయాలు
పులకించె హృదయాలు

ఆ తనువు తీషలు—
ఆ వలపు తలపులు
ఆ పెదవి ఎరుపులు
ఆ పదిల మధువులు

అవకాశపు అవధిజూసి,
ఆవేశము సాముచేసి,
చుంబించమని చెప్పి.
ఆర్జించమని చెప్పి,

పూరించె వూహలను
వుసిగొలిపె మోహమును

— ఎ. కె. రంగనాయకిదేవి

మనసు పోకపోడంతో గుమ్మంలోకి వచ్చాను.

అప్పుడే వీధిలోకి వెళ్ళబోతున్న ఆయన నన్ను చూసి తెచ్చిపెటుకున్న నవ్వుతో "మీరేనా కొ త్తగా ఈవాటాలోకి వచ్చింది" అని అడిగాడు.

"అవును. రండి,కూర్చోండి" అంటూ ఆహ్వానించానాయన్ని.

"అబ్బ, ఏం ఉద్యోగాలో ప్రాణానికి సుఖంలేదు"అంటూ కూర్చున్నాడుఆయన. తెలుపే అయినా క్రౌర్యం కొట్టొచ్చినట్టు కనబడే కళ్ళు. బండబారినట్లున్న శరీరం ముందుకు చొచ్చుకు వచ్చిన పళ్ళు.ఇతను ఆ సుశీలకు భర్తా అనిపించింది నాకు బాధగా.

"అవుననుకోండి సర్వీసన్నతరువాత తప్పుతుందా" అన్నాన్నేను.

"వేళకానివేళ భోజనాలతో, ఎప్పుడు సత్రం భోజనం మఠం నిద్రలా వుంది బ్రతుకు." అన్నాడతడు.

"పాపం ఇంట్లో ఆడవాళ్ళకు స్త్రీకూడా ఇబ్బందే చూడండి" అన్నాడు.

"మా ఆవిడకు ఏం ఇబ్బందివుండదు లెండి. ఇంకా నేను ఇంట్లో వుంటేనే చిటపటమంటూ ఉంటుంది. నేను ఊళ్ళో లేకపోతే తన ఇష్టంవచ్చినట్లుఉండొచ్చు నన్ను చూ స్తే దానికి కంపరం మొద లవుతుందిలా వుంది." సుశీల గురించి ఆయన అభిప్రాయం.

ఆయన సంభాషణాసారం ఏమిటంటే ఆయనకు సుశీలమీద తగని అనుమానం దానివ ల్ల మనశ్శాంతి శూన్యం.

సృష్టిలో వివిధ మన స్తత్వాలు గల మనుషులు. దక్షిణ ఉ త్తర ధృవంలా ఉండే స్త్రీ పురుషులకు జతకలిపి మీరి ద్దరూ కలిసి కాపురం చేయండి'అంటాడు కొన్నిచో ట్ల. విదలో ఎగిలే సెగలతో. దినదినమొక గండంగా సాగుతాయి ఆ సంసారాలు. ఈ చోద్యాన్ని చూసి ఆనం ది స్తుంటాడు ఆలీవా నాటక సూత్రధారి.

* * *

తుంగచాపా, కంచుచెంబు దగరగా చేర్చుకుని; ప్రయర్ శాంక్షన్ లేకుండా కాజువల్ లీవు తీసుకుంది మా శాంత. "చచ్చాంరా భగవాన్, ఈమూడురోజులూ మూడు యుగాలు అనుకుంటూ ఆ సాయం త్రానికి ఎలాగో వంటంయిందనిపించాను.

తె ల్లవారుఝామున 'ఏమండీ.... లేచి పాలకు వెళ్ళండీ .... పిల్లాడు లే స్తే గొడవచేస్తాడు. తెల్లారిపోతే పాలు వుండవు, అంటూ తనే గొడవ మొదలు పెట్టింది. "చేసుకున్న వారికిచేసుకున్నంత మహదేవా" అనుకుని పాలసీసా,డబ్బులు తీసుకుని వీధిలోకి అడుగు పెట్టాను. అప్పుడే పాలసీసాతో సుశీల ఇంట్లోకి వెడుతోంది. కాళ్ళు,చేతులు. గడ్డకట్టుకు పోయే చలిలో కూడా రోజూ మా ఆవిడే పాలు తీసుకొ స్తుంది. చెప్పాను కదండీ శాంత మనసు'నవ్యనవనీతసమానమ"ని. నేను కష్టపడటం తను చూడలేదు.

పాలు తీసుకుని ఆ చలిలో ఒణు కుతూ తిరిగి వ స్తున్నాను. ఎదురుగా ఉన్నదాన్ని చూసేసరికి అడుగుముందుకు పడలేదు. ఎవరయినా కనిపిస్తారేమోనని

ఓ రెండు నిమిషాలు అలాగే చూశాను, ఉహూ .... ఎవరూ లేరు. ధైర్యంగా వణుకుతున్న చేతులతో ఆ వస్తువును తీశాను. బంగారపు గొలుసు. రెండు పేటలుంది. ఎంతచెడ్డా ఆరు కాసులకి తక్కువ వుండదు! ఎవరిదని అడిగేది. మీదా అంటే తమరిది కాకపోయినా మాదే అంటారు కొంతమంది. అయినా 'సిరిరా మోకాలొడ్డేవాడుంటాడా'.... పోనీ తీసుకుపోదామా, ఎందుకో భయం. భయమెందుకూ? నేనేం దొంగతనం చేయటం లేదు కదా? దారిలో ఉన్నది. ఎవరూ క్లెయిమ్ చెయ్యలేదు. నేనేం తప్పుపని చేయడంలేదని ఓ సారి మనసుకు గట్టిగా చెప్పుకుని, దాన్ని జాగ్రత్తగా తీసుకుని ఇంటికి వచ్చాను. అవును.. ఇవాళ లేవగానే సుశీల మొహం చూశాను. అందుకే కాబోలు లక్ష్మీ కటాక్షమయింది.

ఈ సంగతి నేను మా ఆవిడతో కూడా చెప్పదలచుకోలేదు సుమండీ! నువ్వుగింజ కూడా దాగని (అది స్త్రీ లక్షణం మరి!) దానినోట్లో ఈ సంగతి నిలుస్తుందా? పైసా ఖర్చు లేకుండా ఊరూ వాడా చాటించి వస్తుంది నాకేదో లంకెబిందెలు దొరికినట్టు. వంటచేసి, నేనింతతిని, దానికింత పెట్టి ఆదరాబాదరాగ్గా ఆఫీసుకెళ్లాను. అక్కడ ఉన్న సమయంలో గొలుసును ఏంచెయ్యాలి అన్న ఆలోచనలే! దీన్ని ఇలాగే కాంతకివ్వడానికి వీలులేదని, దీన్ని అమ్మి ఓ ఒంటిపేట గొలుసుకొని మిగిలినదాన్ని సేవింగ్సు ఎకౌంట్‌లో వేయాలని నిశ్చయించుకున్నాను, పిల్లా జెల్లా ఉన్న కొంపగదండీ! ఏవయినా అవసరాలు చెప్పిరావుగా. అందుకని మిగతా డబ్బు దాచాలనుకుంటున్నాను. మొగుడు తెచ్చిన వస్తువులు బాగున్నాయన్న వనితలు అపురూపం, ఆఇబ్బంది తీరగానే ఇద్దరంవచ్చి గొలుసు కొనవచ్చని. గొలుసునమ్మగా వచ్చిన ఎనిమిదొందలూ పట్టుకుని ఇంటిముఖంపట్టాను.

* * *

వీధివీధంతా మా గుమ్మంముందే వుంది. ఖర్మకాలి మా బుజ్జిగాడు ఏబండి కిందో పడలేదు గదా అని భయపడుతూ గుండెలరచేత్తో పట్టుకుని గుమ్మంలోకి వెళ్ళాను. మాబాబు నాన్నా నాన్నఅంటూ ఎదురొచ్చాడు. 'అమ్మయ్య' అనుకుని ఏవిటి సంగతని మా ఆవిడని అడగబోయాను. ఇంతలో తనే మొదలుపెట్టింది.

"ఎంతపని జరిగిందో చూశారా! ముందూవెనకా ఆలోచనలేకుండా నిందలేస్తే ఏ ఆడది ఊరుకుంటుంది? సుశీల అత్తవారుపెట్టిన గొలుసుచూస్తే కనబడలేదట. మీరటువెళ్ళారా, తను వీధివీధం దర్శి ఎవరయినా చూశారేమోఅని అడిగింది. మొగుడేమంటాడో అని భయం కాబోలు, రానేవచ్చాడు యమదూతలా. చిన్నగా గొలుసుపోయిన సంగతిచెప్పింది 'సంపాదించి పోస్తుంటేవస్తువుల విలువ తెలియదు. నిన్ననేగా నీ అన్నవచ్చాడు. వాడికిచ్చి పోయిందని నాటకమాడుతున్నావు, అన్నాడు. నిజంగానే పోయిందని, ఆశపిల్లసొమ్ము తినేటంతవాళ్ళుకనవాళ్ళు కారనితిరిగి సమాధానం చెప్పింది. రెచ్చి

పోయినకోపంతో లేకపోతేఎవడిచేతిలోనే పెట్టి ఉంటావు, అని చావబాది వెళ్ళిపోయాడు. మీరువచ్చేముందు పనిపిల్ల వెళ్ళి చూస్తే సుశీలశవం దూలానికి వేళ్ళాడుతోందట. నలుగురినీ ఆ పిల్లే పిలిచింది. అని చెప్పింది మాశాంత. అది సుశీల గొలుసేఅన్న నిర్ణయానికివచ్చేశానునేను. ఎందుకో తగనిబాధ అనిపించింది. వాళ్ళ వాటాలోకివెళ్ళి చూశాను. శవం అక్కడే ఉంది. టేబిల్ పైన కాగితం తీసిచూశాను జీవితంమీద తగ్గినరక్తి, మృత్యువు పై పెరిగిన అపరక్తి తనఆత్మహత్యకు కారణలు మరెవ్వరూ కాదని వ్రాసి వుంది. అవునుమరి. భారతస్త్రీకదూ. చచ్చిపోయే ముందుకూడా భర్తకుఏంహాని జరిగకూడదని జాగ్రత్తపడింది.

అక్కడే నిలబెడ్డ రంగి ఎవరితోనే అంటోంది.

'మడిసికి మంచితనంఉండాల బాబూ. నాకన్నీఎరికే. ఆ అమ్మాయిగోరినిఆయన అవమానం ఏదోసాదించేవోరు.ఆయమ్మ సావుకుఓరు కారణంకాదు. మంచితనం సచ్చినమడిసే...లాచ్చుసుల్లాంటిమడుసుల మద్దినమనసుకు విలువలేదు. మరిగనేటి, సమాకునోళ్ళే, మంచి మరియాద పురుతారు. ఏం ఇసిగినాదో ఆయమ్మ ఇంత గోరంసేసింది. నానోపాలి "అమ్మా మీయన్నకాడకెల్లి ఉండరాదా? నీవుసాలవ్ అంటే 'రంగీ మొగుణ్ణొగ్గిసిన ఆడదానికి ఇలువఉండదు. సచ్చినా ఇక్కడే సావాలి" అంది బాబూ.

నిజమేమరి, మమత, మానవత నశించిన మనుష్యులమధ్యన మనసుకు విలువ ఉండదు, స్వార్థామంలాఉండాల్సినసంసారాలు నరక సదృశమవడానికి మనమే కారణమవుతాము మనసులు కలవనిమనువులు ఇలాగే ఉంటాయి.

నేను అప్పుడే గొలుసును గురించి వాకబుచేసిఉంటే సుశీల చూసుకుని తనదని గుర్తించి ఉండేదేమో? అయినా గొలుసు నా దగ్గరఉందని తెలిస్తే అతడు మరోవిధంగా అనుమానించి అవమానించేవాడేమో? సుశీల మరణానికినేనెంత వరకూబాధ్యుణ్ణి? నేనెంతవరకూబాధ్యుణ్ణి?

---

## కాఫీకంటే 'టీ' శ్రేష్ఠం

మానవుడి ఆరోగ్యానికి టీ కంటే కాఫీ ప్రమాదకరమైనదని శాస్త్రవేత్త డాక్టర్ రామేశ్వర శర్మ అభిప్రాయపడుతున్నారు. డాక్టర్ శర్మ జయపూర్ వైద్య కళాశాలలో ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్. వీరి ఇటీవల సాగించిన తీవ్ర పరిశోధనల వల్ల తేనీటిలో ఫ్లోరైడ్ అనే పదార్థం వుంటుందనీ, కాఫీలో అది వుండదనీ తేల్చిచెప్పారు.

---